

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## నసీమ్

**భాష:** హిందీ, **కథ** - అశిష్ మిశ్ర; కెమెరా - వీరేంద్ర సయాని; **సంగీతం** - వనరాజ్ భాటియా; **దర్శకత్వం** - సయీద్ అఖ్తర్ మీర్జా,
**నటీనటులు** - కైఫీ ఆజ్మీ(అఖ్తర్), మయూరికాంగో (నసీమ్), కులభూషణ్ ఖర్‌బందా, సురేఖాసిక్రి
**విడుదల:** 1995

**వర్తమాన సమాజంలోని సమస్యల్ని,** కల్లోలాల్ని తన చిత్రాలకు మూల కథాంశంగా తీసుకుని, రాజ్యానికి ప్రతిపక్షంలో నిలబడి వ్యాఖ్యానించే దర్శకుడు సయీద్ అఖ్తర్ మీర్జా, సద్విమర్శ స్పష్టమైన వాఖ్య చేయడం ఆయన తత్వం. బాధితులవైపు నిలబడడం. మైనారిటీల వైపు, వెనకబడిన వర్గాలవైపు మాట్లాడడం ఆయన లక్షణం.




1995లో 'నసీమ్'ని ఆయన మిగతా చిత్రాల్లాగా సుదీర్ఘమైన పేరుతోనూ, వ్యంగ్య వ్యాఖ్యానంతోనూ కాకుండా వర్తమాన సంఘటనల్ని కవితాత్మకంగా భావయుక్తంగా విశ్లేషించి నిర్మించాడు. నసీమ్ ఓ చిన్నారి బాలిక. స్కూలుకు పోయే ఆ అమ్మాయికి ఆమె తాతకి ఉన్న అనుబంధాన్ని కాన్వాస్‌గా చేసుకుని 1992 నాటి బాంబే అల్లర్లని వాటి పర్యవసానాల్ని మీర్జా ప్రతిభావంతంగా చూపించాడు. అమాయకమైన నసీమ్ తాను అమితంగా అభిమానించే తాత ఆ ఇద్దరి అన్యోన్యత ఈ చిత్రానికి ఊపిరి. ముస్లిం మతానికి చెందిన ఆ కుటుంబంలో అవసాన దశలో

ఉన్న తాత కైఫీ అజ్మీకి, మనమరాలు నసీమ్‌కీ మధ్య ఉన్న ప్రేమ, కోపం ఆప్యాయతల్ని హృద్యంగా చిత్రించాడు మీర్జా. ఈ చిత్రం భారతదేశ వర్తమాన సాంఘిక స్థితికి అద్దం పట్టింది. ఆందోళనకరమైన స్థితిని శక్తివంతంగా చూపించింది. ముఖ్యంగా నసీమ్ పాత్రని బేస్ చేసుకుని చేసిన వ్యాఖ్యానం ప్రతిభావంతంగా ఉంటుంది.

డిసెంబర్ 6, 1992న అయోధ్యలో 16వ శతాబ్దపు కాలం నాటి మసీదును పేట్రేగిపోయిన దుండగలు అగంతకులు కూల్చివేశారు. అయోధ్య రామ జన్మస్థానమని, రాముడు జన్మించిన స్థలంలోనే మసీదు నిర్మాణమైందని హైందవ వర్గాలు చేసిన ప్రచారం ఫలితంగా ఆ సంఘటన జరిగింది. అంతేకాదు అక్కడ రామాలయం కట్టితీరాలన్న వాదన కూడా వాస్తవరూపం దాల్చేందుకు కృషి నేటికీ జరుగుతూనే ఉంది. సరిగ్గా ఆ కూల్చివేత తరతరాలుగా భారతదేశంలో ఉన్న సహనం, సహజీవనం, భారతీయ సంస్కృతిలో ఉన్న విశాలత విజ్ఞతల్ని తుడిచిపెట్టిందని, అప్పటిదాకా ఉన్న ఓ గొప్ప సుహృద్భావ వాతావరణం డిసెంబర్ 6 తర్వాత చిన్నాభిన్నమైంది అన్న మాటలతో 'నసీమ్' సినిమా మొదలవుతుంది.

తాత అఖ్తర్ 75 ఏళ్ళ వయసులో పక్షవాతంతో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉంటాడు. కానీ ఆయనలోని కవితాత్మకత గొప్పది. కథ చెప్పడం, చెప్పిన కథని వ్యంగ్యంగా మలిచి వ్యాఖ్యానించడం అఖ్తర్‌కి వెన్నతో పెట్టిన విద్య. పదిహేను సంవత్సరాల నసీమ్ స్కూలుకు పోయే అమ్మాయి, చుట్టూ జరుగుతున్న సంఘటనలు అస్పష్టంగా అర్థమవుతూ ఉంటాయి. హింసాత్మక సంఘటనల వార్తలు, నగరంలో పెరుగుతున్న టెన్షన్, తన కుటుంబంలోని తల్లి, తండ్రి, అన్న, అన్న స్నేహితుల్లో పెరుగుతున్న అసహనం కోపం మొత్తంగా అతలాకుతలమైన స్థితిలో నసీమ్‌ను గందరగోళ పరుస్తుంటాయి. ఆ పరిస్థితిని తాత అఖ్తర్ తన మనుమరాలు నసీమ్‌కు వివరిస్తూ ఉంటాడు. నసీమ్ అంటే పొద్దుట వీచే చల్లని గాలి. ఆ పేరున్న నసీమ్ లాగానే అందంగా ఉంటుందని ఆయన చెబుతాడు. ఆయన నసీమ్‌కు చెప్పే కథల్లో ఆనందకరమైన గతాన్ని వర్తమాన దుఃఖంతో కలిపి మలుపులు తిప్పి చెబుతూ ఉంటాడు. తన కథని చాతుర్యంతో చుట్టూ ఉన్న వాళ్ళందరినీ నవ్విస్తూ ఉంటాడు. ఏమైనా జరగనీ, నవ్వడమే ముఖ్యం. ఎంతటి దుఃఖకరమైన, బాధాకరమైన పరిస్థితిలోనైనా ధైర్యం కోల్పోకుండా సంయమనాన్ని పోగొట్టుకోకుండా ధైర్యంగా ఉండాలన్నది ఆయన భావన.

గొప్ప భావుకతతో నిండిన ఆయన దృక్పథం మనమరాలు నసీమ్‌లో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అమాయకంగా కనిపిస్తూ అనేక విషయాల్లో ఆసక్తిని ప్రదర్శిస్తూ తాతతో కలివిడిగా ఉండే నసీమ్‌లో సామాజిక ప్రతిస్పందన కనిపిస్తూ ఉంటుంది. అఖ్తర్ డిసెంబర్ 6, 1992న మరణిస్తాడు. సరిగ్గా బాబ్రీ మసీదు కూలినరోజున, ఆయన మరణంతో గొప్ప కవితాత్మకత, సంస్కారం, సహనశీలత అంతరిస్తాయి. భారతీయతకు ప్రతిరూపంగా కనిపించే నసీమ్ దుఃఖసాగరంలో మునిగిపోతుంది. ఈ చిత్రం బాబ్రీ మసీదు కూల్చివేత, దాని వెన్నంటి ఉన్న హింస, దౌర్జన్యాలను నేపథ్యంగా తీసుకున్నప్పటికీ చిత్రంలో తాతా, మనవరాలి మధ్య ఉండే దగ్గరితనం, ఎదుగుతున్న బాలిక (స్త్రీ)లో ఉండే ఆసక్తి నిర్మలత్వాల్ని గొప్పగా చూపిస్తుంది. అంతేకాదు దర్శకుడు మీర్జా మాటల్లోనే చెప్పుకుంటే భారతీయ జీవితాల్లో అంతరించిపోతున్న కవితాత్మకత, పెరిగిపోతున్న ఉదాసీనతల్ని తాత మనవరాలి అనుబంధంతో వ్యాఖ్యానించిన చిత్రం నసీమ్, మొత్తం మీద వర్తమాన భారతం పైన కవితాత్మకమైన వ్యాఖ్య నసీమ్.

# కైరీ

**భాష** – హింది; **దర్శకత్వం** – అమోల్‌పాలేకర్; **స్క్రీన్‌ప్లే** – చిత్రాపాలేకర్; **నటీనటులు :** శిల్పానా వల్కకర్, యోగితా దేశ్‌పాండే, మోహన్ గోఖలే, అతుల్ కులకర్ణి.

**విడుదల:** 2000

**ఈ సమాజంలో సంపూర్ణమైన** వ్యక్తిగా నిలబడడానికి వ్యక్తిత్వ వికాసమూ, తన కాళ్ళపై తాను నిలబడే సొంత జీవితమూ అవసరమవుతాయి. అవి రెండూ సాధించడానికి చిన్ననాటి నుంచి అనేక ఆటంకాల్ని, ఎత్తుపల్లాల్ని దాటాలి. అందులోనూ ఆ వ్యక్తి స్త్రీ అయినప్పుడు మరింత క్లిష్టమైన సందర్భాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. బాలిక స్థాయి నుండి సంపూర్ణ మహిళగా ఎదిగే క్రమంలో ఆమె అనేక మానసిక, శారీరక కష్టనష్టాల్ని అధిగమించాల్సి ఉంటుంది. ఇవాల్టి సమాజంలో స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి ఇల్లూ, స్కూలూ, సమాజమూ వాటిలోని మనుషులే ప్రధాన ఆటంకాలవుతున్నాయి.. స్త్రీల ఇంటలిజెన్సుకి, స్వేచ్ఛా ప్రియత్వానికి సామాజిక పరిస్థితులే అడ్డగోడలవుతున్నాయి. దోరగా ఉన్న మామిడికాయ పరిపక్వమై పండుగా ఎదగడానికి ఎన్నో శక్తి సామర్థ్యాలూ దీక్షా దక్షతలూ అవసరమవుతున్నాయి. సరిగ్గా ఈ భావనని, ఎదిగే క్రమాన్ని మూలాంశంగా తీసుకుని అమోల్ పాలేకర్ 'కైరీ' చిత్రం నిర్మించాడు.



'ఉమెన్ ఎంపవర్‌మెంట్' అన్న అంశాన్ని ఇతివృత్తంగా చేసుకుని రూపొందించిన చిత్రమే కైరీ. ఇందులో ఒక బాలిక మౌసీ ఆలంబనతో ప్రేరణతో అవరోధాల్ని అధిగ మించి గొప్ప రచయిత్రిగా, విలక్షణమైన వ్యక్తిగా ఎదిగిన వైనం అత్యంత ప్రేరణాత్మకంగా విశ్లేషిస్తుంది.

కైరీ సుప్రసిద్ధ మరాఠీ రచయిత జి.ఎ. కులకర్ణిరాసిన కథ ఆధారంగా నిర్మించబడింది. భారత ప్రభుత్వంలోని ఆరోగ్యం, కుటుంబం సంక్షేమ శాఖ నిర్మించిన ఈ చిత్రంలో దర్శకుడు అమోల్ పాలేకర్ అత్యంత సున్నితమైన అంశాల్ని అంతే ప్రతిభావంతంగా చిత్రీకరించారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలోని ఇరానీ చిత్రాల్లో కనిపించే ప్రకృతి చిత్రణ, పిల్లలకీ ప్రకృతికీ మధ్య పెనవేసుకుని గోచరించే భావ లయ కైరీలో కనిపిస్తుంది. కైరీ చిత్ర కథాంశం విషయానికి వస్తే కన్నవాళ్ళని కోల్పోయిన పదేళ్ళ బాలిక తానీమౌసి ఇంటికి చేరుతుంది. పిల్లలు లేని తానీమౌసీ ఆ బాలికను అమితానందంతో దగ్గరికి తీస్తుంది. వారిద్దరి మధ్య గొప్ప స్నేహమూ, ప్రేమానురాగాలూ ఏర్పడతాయి. కానీ తానీ మౌసీ భర్త బాపూరావు పరాయి స్త్రీ వ్యామోహంలో పడి ఇంటినీ ఇల్లాలినీ చులకన చేస్తాడు. నిర్లక్ష్యంతో వ్యవహరిస్తాడు. తానీ మౌసీ బాలికను ఊళ్ళోని స్కూల్లో వేస్తుంది. తెలివైన బాలికకు ఆ స్కూలూ, టీచరూ ఎలాంటి ప్రేరణా ఇవ్వలేక పోతారు. తానీమౌసీ స్కులుకు వెళ్ళి టీచరును నిలదీస్తుంది. ఇంటికి వచ్చిన తర్వాత బాపూరావు తానీమౌసీ టీచరుతో గొడవ పడ్డం సరైంది కాదంటాడు. ఊళ్ళో తన పరువు పోయిందంటాడు. ఇద్దరి మధ్య గొడవ బాలికకు తెలియకూడదని మౌసి ప్రయత్నిస్తుంది. బాపూరావు బాలికను స్కూలు మానిపించమంటాడు. కానీ తానీమౌసీ బాలికను పక్క ఊర్లోని జాదవ్ టీచర్ స్కూల్లో వేస్తుంది.

తానీమౌసీ, బాలిక ప్రకృతిలో చెట్లమధ్య, పూలమధ్య గొప్పగా కలగలిసిపోతారు. జాదవ్ టీచర్ బాలికలోని ఇంటిలిజెన్స్‌ని పసిగట్టి ప్రోత్సహిస్తాడు. నత్తిగా మాట్లాడే తన బలహీనతను అందంగా రాయలేని తన రాతను గమనించి అంతకుమించిన స్థితిని పొందేందుకు యత్నించమని జాదవ్ టీచర్ బాలికకు ప్రేరణనిస్తాడు. ఆమెలోని భావుకతకు పాదులు వేస్తాడు. ఇంట్లో బాపూరావుతో గొడవలు తీవ్రం కావడంతో తానీమౌసీ బాలికను శ్రీపుమామా వద్దకు పట్నం పంపించివేస్తుంది. పట్నంలో గొప్పగా విలక్షణమైన వ్యక్తిగా ఎదగమని జాదవ్ టీచర్ స్ఫూర్తినిస్తాడు. అలా పట్నం వెళ్ళిన బాలిక ఆత్మవిశ్వాసంతో ఎదిగి గొప్ప రచయిత్రి అవుతుంది. తిరిగి తాను చదివిన జాదవ్ టీచర్ స్కూలుకే వార్షికోత్సవ ముఖ్య అతిథిగా వస్తుంది. కాలగమనంలో కలిసిపోయిన అనుభవాలు, జ్ఞాపకాలు ఆమెను కలచివేస్తాయి. జాదవ్ టీచర్ ఆమెను చూసి గర్వపడతాడు.

చిత్రం మొత్తం బాలిక దృష్టికోణం నుంచి మలచబడింది. వర్తమాన సామాజిక స్థితిలో అన్నిరకాల అణచివేతలకూ గురౌతున్న మహిళగా తానీమౌసీని, భవిష్యత్తులో వ్యక్తిత్వ పగ్గాలు ధరించి తనదైన జీవితాన్ని రూపొందించుకోగలిగిన భావికాలపు స్త్రీగా బాలికను దర్శకుడు చిత్రించాడు. తాను స్వయంగా వివేకవంతురాలూ వ్యక్తిత్వం కలిగినదీ అయినప్పటికీ కుటుంబమూ భర్తా, సమాజమూ అన్న బంధాల మధ్య నలిగిపోయిన తానీమౌసీ తనలాగే తన అక్క కూతురూ కారాదని పట్నం పంపించివేస్తుంది. ఆమె భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. చిత్రం మొత్తంలో దర్శకుడి చిత్రీకరణ కథాకథన శైలి కవితాత్మకంగా సాగుతాయి, తానీమౌసీ, జాదవ్ టీచర్ ఇద్దరూ బాలికకు ప్రేరణ కలిగించిన సన్నివేశాల్లో సంభాషణలు గొప్ప ప్రేరణాత్మకంగా సాగుతాయి. ఉమెన్ ఎంపవర్ మెంట్ మౌలికాంశంగా సాగిన 'క్షైరీ' దృశ్యపరంగా హాయినీ, విషయపరంగా సంతృప్తినీ మిగులుస్తుంది.

●●●

Click here to share your comments on this story